సాక్షి ప్రకాశం
సోమవారం । 13 । జనవరి । 2025



భోగిభాగ్యాలు
మూడు రోజుల పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా మొదటిర రోజు సోమవారం భోగి పండుగ జరుపుకునేందుకు జనం సన్నద్ధమయ్యారు. వేకువనే భోగిమంటలు వేశారు.



ఉసురుతీసిన అనుమానం
కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై ఉన్న అనుమానంతో ఆమె భర్త దాడిచేసి హత్య చేసిన ఘటన కంభంలో ఆదివారం జరిగింది.
- 10లో..

గరిష్టం/కనిష్టం
30/20

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలితీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాల అక్రమ రికవరీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఒంగోలు వన్‌టౌన్: జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ రుణాల అక్రమ రికవరీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు జాతీయ విభిన్న ప్రతిభావంతుల హక్కుల సాధన ట్రస్టు చైర్మన్ ఎం సులోచనా రాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో విభిన్న ప్రతిభావంతులకు 50 మందికి వారి జీవనోపాధులను మెరుగు పరుచుకునేందుకు 90 శాతం నిధులను, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ నుంచి 5 శాతం నిధులను, లబ్ధిదారుని వాటాగా 5 శాతాన్ని కలిపి ఒక్కో లబ్ధిదారునికి 1 లక్ష రూపాయల నుంచి 4 లక్షల రూపాయల వరకూ దాదాపు రూ.1 కోటి రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. తిరిగి లబ్ధిదారులు 6 శాతం వడ్డీతో 60 నెలలు కాలపరిమితితో ప్రతి నెలా చెల్లించాలన్నారు. అయితే అధికారులు మాత్రం లబ్ధిదారుడు చెల్లించిన 5 శాతం వాటాను కూడా సంయుక్త కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని రికవరీ చేస్తున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్ విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో రవిశ్రీశంకర్ ప్రతిభ



మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి బహుమతి అందుకుంటున్న అధ్యాపకులు

ఒంగోలు సిటీ: యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంలో ఒంగోలుకు చెందిన ఆంధ్రకేసరి జూనియర్ కళాశాల విద్యార్థి రవిశ్రీశంకర్ రూపొందించిన 'లైట్ కమ్యూనికేషన్' ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వారి చేతుల మీదుగా విద్యార్థి తరపున కళాశాల అధ్యాపకులు నాగలక్ష్మీ, అనీల్ రెడ్డి ప్రశంసపత్రం, బహుమతి అందుకున్నారు.

కాపు సంఘం జిల్లా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

ఒంగోలు వన్‌టౌన్: కాపు సంఘం అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేస్తూ కాపు నాయకులు నిర్ణయం తీసుకున్నారు. ఒంగోలులోని కాపు సంఘం కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో అడ్‌హాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడుగా కొక్కిరాల సంజీవ కుమార్, ఉపాధ్యక్షుడిగా కే ఆంజనేయులు, ఎస్ సాంబయ్య, సీహెచ్ నారాయణ, బీ రామ్ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా టీ శ్రీనివాస మూర్తి, కోశాధికారిగా ఎన్ శ్రీనివాసరావు మొత్తం 27 మందితో అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశారు.

వైభవంగా స్వామి వివేకానంద జయంతి



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీసీ నాయకులు

ఒంగోలు సిటీ: ఒంగోలు జేసీఐ, ఒంగోలు జేసీసీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక హైదర్ క్లబ్ లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒంగోలు అధ్యక్షుడు జేసీ ఎం.వి.సుబ్బారావు మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం భారతదేశ యువతకు ఆదర్శమని తెలిపారు. కేవలం 39 సంవత్సరాలకే మరణించినప్పటికీ కూడా నేటికి భారతీయుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించారన్నారు. ఒంగోలు జేసీసీ చైర్మన్ జేసీ శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో స్వామి వివేకానంద ప్రసంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని, మైడియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా అనే మాట అమెరికన్ల హృదయాల్లో నేటికీ నిలిచిపోయిందని చెప్పారు. ఫాస్ట్ ప్రెసిడెంట్ జేసీ విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ ప్రపంచానికి యోగా ను పరిచయం చేసిన స్వామి వివేకానంద అని వ్యాయామం ప్రగతిని ప్రాధాన్యతను స్వామి తెలిపారన్నారు. స్వామి వివేకానందకు నివాళులర్పించి నినదించారు. కార్యక్రమంలో జేసీ బాలకృష్ణ, జేసీఐ ఫాస్ట్ ప్రెసిడెంట్స్ వీవీ రమణ, నైనాల రామకృష్ణ, ఆత్మకూరు బ్రహ్మయ్య, కనకారావు, పిడుగుజాలిరెడ్డి, ఎస్వీఎస్ ఏడుకొండలు, శ్రీధర్, సోమినేని సురేష్, పువ్వాడ రాజేష్, డాక్టరు రవి కుమార్, సభ్యులు మాల్యాద్రి, శ్రీకాంత్, నరేంద్రకుమార్, జనసేవ శ్రీనివాసరావు, కుంచాల బాలమురళీకృష్ణ, దివ్య, తన్నీరు సురేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నాడు మురిసి.. నేడు కళతప్పి..

చుట్టూ పచ్చని చేలు. అంబా అంటూ పాడి పశువుల సందడి..గజ్జల సవ్వడితో జోడెద్దుల పరుగులు.. రైతుల పలకరింపులు.. ఇళ్ల ముందు రంగవల్లులతో గొబ్బెమ్మలు, ముంగిళ్లలో ధాన్యపు సిరులు..హరిదాసుల కీర్తనలతో సంక్రాంతి వేళ సందడిగా ఉండాల్సిన పల్లెలు నేడు కళతప్పాయి. సర్కారు చేయూత కరువై అన్ని వర్గాల ప్రజలు ఉసూరుమంటున్నారు. కొనుగోలు శక్తి క్షీణించి పండుగ ఉత్సాహం కొరవడింది. పండుగ కళ తప్పిన పల్లెకు కొండపి నియోజకవర్గం సింగరాయకొండ మండలం పాకల గ్రామం నిదర్శనంగా నిలుస్తోంది.



పాకల గ్రామంలో రంగవల్లులు లేక బోసి పోతున్న రోడ్లు

- పల్లెల్లో కానరాని సంక్రాంతి సందడి
- సాగు భరోసా లేక నష్టాల ఊబిలో రైతులు
- వేటసాగక మత్స్యకారుల నిర్వేదం
- గిట్టుబాటు ధర లేక ఉసూరుమంటున్న పాడి రైతులు
- పనులు లేక మహిళలు, ఉద్యోగాలు లేక యువత ఆవేదన
- కొనుగోలు శక్తి లేక కళతప్పిన పల్లె

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జాతీయ రహదారికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో పాకల గ్రామం ఉంది. ఈ గ్రామానికి వెళ్లాలంటే ప్రారంభంలో రైల్వేగేటు దర్శనమిస్తుంది. దాన్ని దాటుకుని ముందుకు వెళ్తుంటే రోడ్డుకు ఇరువైపులా చుట్టూ పచ్చని చేలు, తాటిచెట్లకు కల్లు గీసే గీతకార్మికుల సందడి, నీటితో కళకళలాడుతున్న చెరువులు, పశువుల కుంటలు, వరిచేలపై వాలి పురుగులు తింటున్న కొంగలతో పల్లెవాతావరణం కనబడుతుంది. చివరగా సముద్రం.. ఆ ప్రాంతానికి వచ్చిన వారిని సేదతీరుస్తుంది. సంక్రాంతి వంటి పెద్ద పండుగకు ఈ గ్రామంలో పండుగ సందడి గతంలో సుమారు 10 రోజుల ముందు నుంచే ప్రారంభమయ్యేది. కానీ ఈసారి ఆ పరిస్థితి కనబడటం లేదు. పండుగ సందడిని పరిశీలించేందుకు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో గ్రామానికి వెళ్లిన ‘సాక్షి ప్రతినిధి’కి బోసి పోయిన వీధులు దర్శనమిచ్చాయి. ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులు లేవు. గొబ్బెమ్మల ఊసే లేదు. మరో పక్క రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. వారిలో ఆనందం ఏకోశానా కనబడటం లేదు. కల్తీ విత్తనాలు, ఉల్లికోడు వంటి తెగుళ్లతో వరి పైరు ఎదుగుదల లేక, పురుగుమందులు కొట్టలేక, ఒక వేళ పంట పండినా దిగుబడి ఏస్థాయిలో తగ్గుతుందో, చేసిన అప్పులు ఏవిధంగా తీర్చాలో అర్థం కాక పండుగ విషయాన్ని మర్చిపోయి ఆవేదన చెందుతున్నారు. ఈ సంవత్సరం రైతు భరోసా ఇవ్వలేదు. ఈ క్రాప్ నమోదు లేదు. ఫసల్‌బీమా యోజన పథకం నమోదు లేదు. వ్యవసాయశాఖ అధికారుల జాడే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అగమ్య గోచరంగా పాడిరైతుల పరిస్థితి

పాడిరైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వంలో 10 శాతం పాలధర రూ.80 ఉంటే ప్రస్తుతం పాలధర 10 శాతం కేవలం రూ.55 మాత్రమే ఉంది. ఒక గేదె రోజుకు 5 లీటర్ల పాలు ఇస్తుంది. గేదెకు ఒక రోజుకు దాణా, వరిగడ్డి ఖర్చు సుమారు రూ.190 కాగా పాలు 8 శాతం మాత్రమే వస్తుండటంతో కేవలం రూ.200 మాత్రమే వస్తుందని దీంతో వచ్చే 10 రూపాయల ఆదాయంతో ఏ విధంగా గడపాలని పాడిరైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు వేట లేదు భరోసా లేదు

మత్స్యకారుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. గత జూన్ నెలలో వేట నిషేధం ముగిసినప్పటి నుంచి సముద్రంలో చేపల వేట సక్రమంగా లేదు. దీనికి తోడు మూడు నెలలుగా రోజుల తరబడి తుఫానులు, వాయుగుండాల కారణంగా సముద్రంలో వేటకు వెళ్లలేక ఇళ్ల వద్దే ఉండిపోయామని ఈ సంవత్సరం మత్స్యకార భరోసా కూడా లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వేళ పండుగ జరుపుకోవాలంటే అప్పు చేసి పప్పు తినాల్సిన సామెతగా ఉందన్నారు. ఒకవేళ బయట పనులకు వెళ్లాలన్నా సక్రమంగా పనులు లేవని చెప్పారు.

బోసిపోతున్న దుకాణాలు

గ్రామంలో కిరాణా, దుస్తుల దుకాణాలు, పిండిమరలు, టైలరింగ్ షాపుల్లో రద్దీ వాతావరణం కనబడలేదు. అన్ని షాపుల్లో వ్యాపారులు నింపాదిగా పనులు చేసుకుంటున్నారు. గతంలో అయితే పండుగ 10 రోజుల ముందు నుంచే హడావుడి ఉండేదని ఈసారి ఆ హడావుడి కనబడలేదన్నారు. మహిళలైతే ఈసారి సున్నావడ్డీ పథకం లేదని, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు వంటి పథకాలు లేవని, స్త్రీనిధి డబ్బులు సమయానికి అందటం లేదని తెలిపారు. ఒక్కోసారి నెలరోజులకు కూడా స్త్రీనిధి డబ్బులు రావటం లేదన్నారు. ఈ సారి పండుగ కళ తప్పిందని పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఏదో మమ అనిపించాల్సి ఉందని చెప్పారు. ఎప్పుడూ ఇటువంటి దయనీయంగా పండుగ జరుపుకోలేదని అన్ని వర్గాల ప్రజలు తెలియజేస్తున్నారు. యువకులైతే ఉద్యోగావకాశాలు లేక ఉద్యోగాల వేటలో పండుగకు గ్రామానికి రాలేక పట్టణాల్లోనే ఉద్యోగాల వేటలో ఉన్నారని వారి తల్లిదండ్రులు తెలిపారు. అసలు భోగిముందు రోజు నుంచే గ్రామంలో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారితో సందడిగా ఉండేదని, కానీ ఈసారి భోగి పండుగ ముందు రోజు వచ్చినా ఇంకా ఎవరూ రాలేదని భోగిరోజు వస్తారేమోనని తెలిపారు.

సందడి లేని పాకల బీచ్

ప్రతి సంవత్సరం పండుగ సెలవుల్లో పాకల బీచ్ సందడిగా ఉండేదని, కానీ ఈసారి ఆ సందడి కరువైందని గ్రామస్తులు తెలిపారు. అందుకు తగ్గట్టు బీచ్‌లో పరిస్థితి కూడా అలాగే ఉంది. బీచ్‌కు వచ్చిన ప్రజలను వేళ్లమీద లెక్కించవచ్చు. మొత్తం మీద ఈ సంవత్సరం ప్రజలు సంక్షేమ పథకాలు అందక, పనులు లేక అతిముఖ్యమైన సంక్రాంతి పండుగను మమ అనిపించే పరిస్థితి ఉంది.



పర్యాటకులు లేక వెలవెలబోతున్న పాకల బీచ్

అరకొర ఆదాయంతో పండుగ ఎలా..

నేను 4 గేదెలు పెంచుతున్నాను. ప్రస్తుతం 10 శాతం పాలకు రూ.55 డెయిరీల్లో ఇస్తున్నారు. ఆ ప్రకారం నా పాలకు 8 శాతం రావటంతో కేవలం లీటరు రూ.40 వస్తుంది. రోజుకు గేదె 5 లీటర్ల పాలు ఇస్తుండగా రూ.200 రాగా, దాణా, వరిగడ్డి ఖర్చు రూ.190 అవుతుంది. కేవలం రోజుకు 10 రూపాయలు మాత్రమే మిగులుతుంది. అరకొర ఆదాయంతో పండుగ ఏవిధంగా జరుపుకోవాలి.

– జంపాని ప్రతాప్, పాడి రైతు, పాకల



సాగు దిగులే తప్ప..పండుగ ఉత్సాహం లేదు

నేను 5 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నాను. మొదట గ్రామంలో వరి విత్తనాలు కొనుగోలు చేశాను. రెండున్నర నెలలు అయినా పెరుగుదల సక్రమంగా లేదు. సత్తువలు, పురుగుమందులు వాడాను. అయినా ప్రయోజనం లేదు. మా సమస్య చెప్పుకుందామంటే అధికారి అందుబాటులో లేడు. దిగుబడి వస్తుందో ఎంత వస్తుందో అర్థం కాకుండా ఉంది. పొలం పనుల్లోనే గడుపుతున్నాను. ఈ సంవత్సరం పంట ఎలా ఉంటుందోనన్న దిగులే తప్ప పండుగ ఉత్సాహం లేదు.

– మారంరెడ్డి చినకోటిరెడ్డి, రైతు, పాకల



మూడు నెలలుగా బాడుగల్లేవు..

నాకు కారు ఉంది. ప్రతి సంవత్సరం పండుగ సీజన్‌లో నెల్లూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు బాడుగలతో బిజీబిజీగా గడిపేవాడిని. కానీ ఈ సంవత్సరం ఆ పరిస్థితి లేదు. మూడు నెలలుగా బాడుగలు లేక ఖాళీగా ఉంటున్నాను. ఏదో మొక్కుబడిగా పండుగ జరుపుకుంటాను.

– మారంరెడ్డి శివారెడ్డి, కారు ఓనర్, పాకల



నిరుద్యోగ భృతి లేదు..ఉద్యోగాలు లేవు

నేను డిగ్రీ పూర్తి చేసి రెండు సంవత్సరాలు అయింది. ప్రస్తుతం ఉద్యోగాల వేటలో ఉన్నాను. ఇటీవల ఎన్నికల్లో ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు తప్ప ఇవ్వటం లేదు. మరో పక్క ఉద్యోగాలు కూడా ఇవ్వటం లేదు. పట్టణానికి వెళ్లి ఉద్యోగం కోసం వేట మొదలెట్టాలంటే ఆర్థిక పరిస్థితి అనుకూలించటం లేదు. ఈ సంవత్సరం పండుగ జరుపుకోవాలన్న కోరిక లేదు.

– వాయిల రాంబాబు, మత్స్యకారుడు, పాకల

పేదలకు కూటమి ప్రభుత్వం మరణాల బహుమతి

- ప్రాణభిక్ష పెట్టే ఆరోగ్యశ్రీని చంపేసిన ప్రభుత్వం
- సహాయం కోరేవారిని పచ్చకండువా వేసుకోమంటున్నారు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం:

నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా రాష్ట్రంలో ఉన్న పేదవాళ్లకు కూటమి ప్రభుత్వం మరణాలను బహుమతిగా అందిస్తోందని, ప్రాణభిక్ష పెట్టే ఆరోగ్యశ్రీని ఈ ప్రభుత్వం చంపేసిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లెకు చెందిన మంగమూరి వెంకట చెన్నయ్య పల్నాడు జిల్లా నరసరావుపేటలో బేల్దారి పనులు చేసుకుంటున్నాడని, సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి చేరేందుకు తన భార్య లక్ష్మీదేవి, కుమారుడు అభిచంద్‌లతో శనివారం మోటారు బైక్‌పై వస్తున్న సమయంలో బాపట్ల జిల్లా వెలగల చెరువు వద్ద కారు ఢీకొందని చెప్పారు. ఈ సంఘటనలో భార్య లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందిందని, వెంకటచెన్నయ్య, అభిచంద్‌లకు తీవ్రంగా గాయాలయ్యాయన్నారు. వివిధ వైద్యశాలల్లో ప్రాణప్రాయ స్థితిలో చికిత్సపొందుతున్నారని ఆయన తెలిపారు. సకాలంలో అంబులెన్స్ స్పందించకపోవడం వలన లక్ష్మీదేవి ప్రాణాలు కోల్పోతే, మిగిలిన వారు ఆరోగ్యశ్రీ కార్డుపై వైద్యశాలల్లో చికిత్స అందక కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. ఆర్థిక స్తోమతలేక గుంటూరు, మంగళగిరి, వినుకొండ వైద్యశాలల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిలో ఉన్నారన్నారు. పుల్లలచెరువు మండలంలోని ముటుకుల గ్రామానికి చెందిన ఏసుబాబు ఎముకలకు సంబంధించిన అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని, ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమతలేక, ఆరోగ్యశ్రీ కార్డు చెల్లుబాటులోకి రాక చావుబతుకులతో హైదరాబాదులోని నిమ్స్ వైద్యశాలలో కొట్టుమిట్టాడుతున్నాడని అన్నారు. సహాయం కోసం ఆయన కుటుంబ సభ్యులు కూటమి నాయకుల వద్దకు వెళ్తే పచ్చకండువా కప్పుకుంటే అన్ని విధాలుగా సహకరిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తిరుపతిలో జరిగిన సంఘటనలో ఆరుగురు మృతి చెందారని, ఆ సంఘటన మరువకముందే రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతి చెందితే ఇవి ప్రభుత్వ హత్యలు కాదని ఎలా సమర్థించుకుంటారని ఆయన ప్రశ్నించారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో మంజూరయిన రోడ్డుకు శంకుస్థాపన?

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో మంజూరైన జాతీయ రహదారికి కూటమి నాయకులు శంకుస్థాపన చేయడం ఇదేమి చర్య అని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రశ్నించారు. మురికిమళ్ల తండా నుంచి మల్లాపాలెం అడ్డరోడ్డు వరకు 565 జాతీయ రహదారిని అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయించారని, ఈ మేరకు అటవీశాఖ అనుమతులు కూడా వచ్చేలా ప్రయత్నం చేశారని, రోడ్డు నిర్మాణం ప్రారంభం అయ్యే సమయంలో ఎన్నికలు రావడం వలన ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను బాధ్యతలు చేపట్టిన తరువాత రోడ్డు గురించి కలెక్టర్‌తో చర్చించానని, డీసీఆర్ సమావేశంలో బలంగా వాదించానని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు నియోజకవర్గ కూటమి నాయకుడు ఎరిక్షన్‌బాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మరెడ్డితో శంకుస్థాపన చేయించాడని, తన పరిధిలోకి రాదన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే పరిధిలోకి వచ్చే పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని దావుపల్లి వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ వర్గీయులు చేపట్టిన పనులకు బిల్లులు చేయించకుండా అడ్డుపడుతున్నారన్నారు. పచ్చకండువా కప్పుకొని పార్టీలో చేరితేనే బిల్లులు మంజూరు చేయిస్తామనడంలో అర్థంలేదని అన్నారు. గిరిజన గూడెంలలో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారని, ఇది అధికార అహంకారానికి నిదర్శనమని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎటువంటి హోదాలేని వ్యక్తి పోస్టులు, ప్రభుత్వ పథకాలను అమ్ముకుంటున్నాడని, ఇటువంటి చర్య సరైంది కాదని, మరోసారి పునరావృతం కాకుండా మంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు అన్న ఉద్దేశంతో ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యాన పంటను ఎంపీడీవో మంజూరు చేయలేదని, మండల సమావేశంలో ఈ విషయం గురించి ప్రశ్నిస్తామని.. సమావేశానికి ఆయన రాకుండా, ఇతర శాఖలకు చెందిన అధికారులను కూడా అడ్డుకున్నాడని మండిపడ్డారు. పెద్దదోర్నాల మండలంలోని చిన్నదోర్నాల ప్రాంతానికి చెందిన గిరిజనులు మంచినీళ్లకోసం రోడ్డు ఎక్కారని, 10 రోజులుగా వారికి నీరు అందివ్వకుండా ఏం చేస్తున్నారని, ఆ బిల్లులు ఎవరికి ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. తాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తరువాత 1100 ట్యాంకర్లతో ప్రజలకు ఉచితంగా నీళ్లు అందించానని, యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లెలో టీడీపీ నాయకుడు ప్రజలకు ఉచితంగా నీళ్లు అందిస్తుంటే ఆయనను పోలీసులతో కొట్టించిన ఘనత కూటమి నాయకుడికి ఉందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఎస్.పోలయ్య, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె రమేష్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పి.రాములు నాయక్, వివిధ శాఖల నాయకులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.అరుణాబాయి, చెవుల అంజయ్య, బి.బాలచెన్నయ్య, ఎల్లారెడ్డి రోషిరెడ్డి పాల్గొన్నారు.

17 ఎయిడెడ్ స్కూళ్లకు నోటీసులు

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎన్‌రోల్‌మెంట్ తగ్గిన కారణంగా 17 పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్ కుమార్ నోటీసులు జారీ చేశారు. మీ పాఠశాలలకు ఎందుకు గుర్తింపు రద్దు చేయకూడదో అని తెలియజేస్తూ మండల విద్యాశాఖాధికారుల ద్వారా ఆ పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎయిడెడ్ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్, తక్కువ పిల్లలున్న పాఠశాలల్లో కలిపి మొత్తం 97 మంది మిగులు ఉపాధ్యాయులుగా ఉన్నట్లు డీఈఓ తెలిపారు. మిగులు ఉపాధ్యాయులను పిల్లలున్న చోట బదిలీ చేసినా ఎయిడెడ్ యాజమాన్యాలు అంగీకరించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. మిగులు ఉపాధ్యాయులందరినీ ఇబ్బందులు లేకుండా కౌన్సిలింగ్ ద్వారా ఎలా చేయాలనే దానిపై ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.


నీళ్లివ్వండి మహాప్రభో..

- తాగునీటి కోసం రోడ్డెక్కిన చెంచు గిరిజనులు
- చిన్నదోర్నాల వద్ద మార్కాపురం–దోర్నాల రహదారిపై రాస్తారోకో



ఆందోళనకారులతో కిక్కిరిసిన చిన్నదోర్నాల బస్టాప్

పెద్దదోర్నాల: గూడేనికి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా తమను పట్టించుకున్న వారే కరువయ్యారని వాపోతూ మండల పరిధిలోని బయ్యన్న గూడేనికి చెందిన చెంచు గిరిజనులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు సుమారు ఐదు కిలోమీటర్లు ప్రయాణించి మండల పరిధిలోని చిన్నదోర్నాలకు చేరుకుని మార్కాపురం–దోర్నాల రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. దీంతో మార్కాపురం, దోర్నాల రహదారిలో సుమారు 45 నిమిషాల పాటు ట్రాఫిక్ జాం అయింది. రోడ్డు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెంలో ఒకే ఒక డీప్ బోర్ ఉండగా అది గతంలో లోపల పడిపోయిందని, దీంతో నీటి సరఫరా నిలిచిపోయిందని చెంచు గిరిజనులు పేర్కొంటున్నారు. గత వేసవిలో తమ గూడేనికి రెండు రోజులకు ఒకసారి ఆర్డీటీ సంస్థ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిందన్నారు. అయితే ఆర్డీటీ సంస్థ సైతం నీటి సరఫరా నిలిపివేయటంతో గూడెంలో నీటి సమస్యలు తలెత్తాయని వారు పేర్కొన్నారు. అప్పటి నుంచి వ్యవసాయ భూముల వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నామని, అయితే 10 రోజుల నుంచి రైతులు కూడా కట్టడి చేయటంతో గూడెం వాసులకు నీటి సమస్య తీవ్రతరమైందని వారు వాపోయారు. ఇన్ని రోజుల నుంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమను పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా చిన్నదోర్నాల బస్‌స్టాప్‌లో ఆందోళన చేస్తున్న గిరిజనుల నినాదాలతో నిండిపోయింది. దీంతో ఎస్సై మహేష్ సంఘటనా స్థలికి చేరుకుని రాస్తారోకో చేస్తున్న వారికి నచ్చజెప్పటంతో వారు ఆందోళన విరమించారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగటంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.



చిన్నదోర్నాల వద్ద రాస్తారోకో చేస్తున్న చెంచు గిరిజనులు

క్లుప్తంగా

అర్ధరాత్రి యువకుల హల్‌చల్

- ఒంగోలు ఇందిరమ్మ కాలనీ–పెళ్లూరు యువకుల పరస్పర దాడులు

ఒంగోలు టౌన్: మద్యం మత్తులో యువకులు హల్‌చల్ చేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో దాడులు, ప్రతి దాడులతో ఒంగోలులో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నగరానికి చెందిన ఒక ప్రముఖ విద్యాసంస్థ స్థానిక చెరువుకొమ్ముపాలెం వద్ద కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తోంది. ఒంగోలు ఇందిరమ్మ కాలనీకి చెందిన రౌడీ షీటర్ డేవిడ్ కొందరు యువకులతో కలిసి అక్కడకు వెళ్లాడు. అవుటర్స్ కావడంతో వారిని లోపలకు అనుమతించలేదు. అప్పటికే వారు మద్యం సేవించి ఉన్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటింది. సమీపంలోని పెళ్లూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గరకు చేరుకుని రచ్చ చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న పెళ్లూరుకు చెందిన అయ్యప్ప గొడవలు చేయకుండా ఇంటికి వెళ్లమంటూ వారిని వారించాడు. దాంతో మద్యం మత్తులో ఉన్న రౌడీషీటర్ డేవిడ్, అతడి అనుచరులు కలిసి అయ్యప్పపై దాడి చేశారు. అతడి తల పగలడంతో వెంటనే జీజీహెచ్‌కి తరలించారు. అయితే, అయ్యప్పను పరామర్శించడానికి వచ్చిన పెళ్లూరుకు చెందిన యువకులు ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కొప్పోలు బ్రిడ్జి దగ్గరకు చేరుకుని డేవిడ్ అనుచరులు బిక్షాలు, రాములును చితకబాదారు. ఈ దాడులు, ప్రతి దాడులతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాతకు సర్ప భయం..!



- పొలాల్లో పొంచి ఉంటున్న పాములు
- పశ్చిమ ప్రకాశంలో అధికంగా సంచారం
- గత నాలుగు నెలల్లో 18 మందికి పాముకాటు
- అప్రమత్తత, అవగాహనే ఆయుధం

మార్కాపురం: పొలంలో హలం పట్టి ఆరుగాలం శ్రమించే అన్నదాతలను సర్ప భయం వెంటాడుతోంది. పొలాల్లో పాములు సంచరిస్తూ కాటేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రకాశంలోని పొలాల్లో రైతులకు పాముకాటు సంఘటనలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. కొందరు రైతులు అదృష్టవశాత్తూ వెంటనే చికిత్స పొందుతుండగా, మరికొందరు మాత్రం సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. తమకు కొత్త సమస్య వచ్చిపడిందంటూ రైతన్నలు వాపోతున్నారు. మార్కాపురం ప్రాంతంలో గడిచిన 4 నెలల వ్యవధిలో 18 మంది పాముకాటుకు గురై స్థానిక జీజీహెచ్‌లో చికిత్స పొందారంటే.. పాముల సంచారం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత నెల 27వ తేదీ మార్కాపురం మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన గుంజె చెన్నయ్య పొలంలో సొరకాయలు కోసేందుకు వెళ్లి కట్లపాము కాటుకు గురై మృతి చెందాడు. మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, కంభం తదితర ప్రాంతాల్లో రైతులు, కూలీలు పాముకాటుకు గురై మృత్యువాతపడుతున్నారు. ప్రస్తుతం మిర్చి కోతలు జరుగుతుండటంతో అధిక సంఖ్యలో కూలీలు ఆ పనులకు వెళ్తున్నారు. పొలాల్లో ఉన్న పాములు కాటేస్తుండటంతో రైతులు, కూలీలు మృత్యువాతపడుతున్నారు. పొలాల్లో ఎక్కువగా తాచు, జెర్రిపోతులు, కట్లపాము, రక్తపింజర్లు తిరుగుతున్నాయి. వీటితో పాటు నల్లమల అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో కొండచిలువలు ఊర్లలోకి వచ్చి దూడలు, గొర్రెలు, మేకపిల్లలు, కోళ్లను తింటున్నాయి. పొలం పనుల్లో ఏమరుపాటుగా ఉన్నప్పుడు పాములు కాటేస్తున్నాయి. పాముకాటుకు గురైన వారిలో సగం మంది భయంతోనే ప్రాణాలు వదులుతున్నారు. కంది పొలాల్లో పసికర పాములు తిరుగుతున్నాయి. ఇవి పచ్చగా ఉండటంతో రైతులు గుర్తించలేకపోతున్నారు. పొలాలతో పాటు గ్రామాల్లోనూ పలువురు పాముకాటుకు గురవుతున్నారు. అయితే, చాలా మంది వెంటనే వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొంది క్షేమంగా ఇంటికి చేరుకుంటున్నారు.

మార్కాపురం జీజీహెచ్‌లో గత 4 నెలల్లో నమోదైన పాముకాటు కేసుల వివరాలు...	
నెల	నమోదైన కేసులు
డిసెంబరు	3
నవంబరు	4
అక్టోబరు	6
సెప్టెంబరు	5

గతేడాది పలుచోట్ల కొండచిలువలు పట్టివేత...

- అక్టోబరు 30న మార్కాపురం పట్టణంలోని జార్జి ఫార్మసీ కళాశాలలోకి 10 అడుగుల పొడవైన కొండచిలువ రాగా, స్నేక్ క్యాచర్‌కు చెప్పడంతో దానిని పట్టుకుని అడవిలో వదిలారు.
- సెప్టెంబరున రాచర్ల పొలాల్లో కొండ చిలువను పట్టుకున్నారు.
- నవంబరులో మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీలో జనావాసాల మధ్య కొండచిలువను పట్టుకున్నారు.
- గతేడాది ఫిబ్రవరిలో తర్లుపాడు మండలం గొల్లపల్లి శివార్లలో కొండచిలువ గొర్రె పిల్లను మింగింది.

పాము కాటును గుర్తించడం ఇలా...

పాము కాటు వేసినప్పుడు ఒకటి లేదా రెండు గాట్లు ఉంటే విషసర్పంగా భావించాలి. పాముకాటు వేసిన చోట వెంటనే గట్టిగా తాడుతో బిగించి కట్టాలి. దీని వలన విషం గుండెకు చేరదు. వెంటనే వైద్యశాలకు తరలించాలి. కొంత మంది పాము కరిచిన చోట నోటితో కొరికి విషం తీస్తుంటారు. ఇలా చేయడం ప్రమాదకరం. పొలాల్లో ఎలుకల కోసం వచ్చిన పాములు మనుషులను కాటేస్తున్నాయి.



పత్తి చేలో ఉన్న పాము

అందుబాటులో వ్యాక్సిన్



పాము కరిచిన వ్యక్తిని వెంటనే వైద్యశాలకు తీసుకురావాలి. ప్రశాంతంగా ఉంచాలి. టెన్షన్ పెట్టకూడదు. బీపీ లెవల్స్ చెక్ చేయాలి. డాక్టర్ సలహాలు లేకుండా సొంత మందులు వాడొద్దు. మార్కాపురం జీజీహెచ్‌లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

– డాక్టర్ రామచంద్రరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్, మార్కాపురం

50 ఏళ్ల తర్వాత ఏకమై..



ఆత్మీయ సమ్మేళనంలో తమ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

- ఘనంగా ముప్పవరం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొండపి: స్నేహానికి వయసుతో పనిలేదని నిరూపించారు కొండపి మండలంలోని ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. పాఠశాలలో 1974–75, 1975–76, 1976–77 విద్యా సంవత్సరాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. బాల్యంలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బాల్యంలో ఏర్పడిన స్నేహం కలకాలం ఉంటుందని నిరూపించారు. ఆనాడు తమకు చదువు చెప్పిన తెలుగు ఉపాధ్యాయుడు హరిముకుందారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు జీ శ్రీనివాసులు, వ్యాయమ ఉపాధ్యాయుడు సీహెచ్ సుబ్బారావు, పాఠశాల గ్రంథపాలకుడు నరసింహారావులను సత్కరించారు. రోజంతా సరదాగా గడిపారు.

అల్లుడిని చంపాలని మామ సుపారీ

- విషయం తెలిసి కూతురు ఫిర్యాదు

పెద్దారవీడు: అల్లుడిని చంపాలని మామ ప్రయత్నించగా, కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం నికరంపల్లి గ్రామానికి చెందిన దుదేకుల కాశింబీని అదే గ్రామానికి చెందిన బత్తుల అంకయ్య ఐదేళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి వివాహం ఇష్టంలేకపోవడంతో అంకయ్యపై కక్ష పెంచుకున్న కాశింబీ తండ్రి దాదావలి అతన్ని చంపాలని నిర్ణయించుకున్నాడు. సుమారు పది రోజుల క్రితం దేవరాజుగట్టు గ్రామానికి చెందిన బట్టగిరి రాఘవేంద్రరెడ్డికి మూడు లక్షల రూపాయలిచ్చి తన అల్లుడు బత్తుల అంకయ్యను చంపాలని సూచించాడు. ఈ విషయం తెలుసుకున్న నికరంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గోగిరెడ్డి సుబ్బారెడ్డి.. కాశింబీకి తెలియజేశాడు. దీంతో తన తండ్రి దాదావలి, సుపారీ తీసుకున్న బట్టగిరి రాఘవేంద్రరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో కాశింబీ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉసురుతీసిన అనుమానం

- కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన భర్త
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు?



మృతురాలి ఫైల్ ఫొటో

కంభం: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పై అనుమానంతో ఉన్న భర్త దాడి చేసి ఆమెను హత్య చేసిన ఘటన ఆదివారం కంభంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని తురిమెళ్ల గ్రామానికి చెందిన అర్థవీటి నాగ అంజలి(40)కి 26 సంవత్సరాల క్రితం కంభం పట్టణంలోని సాదుమియా వీధికి చెందిన శివరంగయ్యతో వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉండగా ముగ్గురికి వివాహాలయ్యాయి. శివరంగయ్య లారీడ్రైవర్ గా పని చేస్తూ చిన్నపాటి ఫైనాన్స్ లు నడుపుకుంటుండగా, భార్య పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్లో ఆయాగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో భార్య, భర్తల మధ్య గొడవ జరగగా భార్యను చెక్కతో కొట్టడంతో ఆమె తలకు బలమైన గాయాలై మంచంపై పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ కె.మల్లిఖార్జున, ఎస్సై నరసింహారావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు సంఘటన జరిగిన ఇంటి వద్దకు వచ్చి విచారించారు. మార్కాపురం క్లూస్ టీమ్ బృందం వేలిముద్రలు సేకరించారు. కంభం ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

అనుమానంతోనే హత్య చేశాడా..:

భార్య, భర్తల మధ్య అప్పుడప్పుడూ చిన్నపాటి గొడవలు జరుగుతుండేవని తెలిసింది. శనివారం రాత్రి 9 గంటల సమయంలో అల్లుడు తన కుమార్తెతో గొడవపడుతున్నాడని తన మనుమరాలు ఫోన్ చేసి చెప్పిందని, తెల్లవారే సరికే ఇలా రక్తపు గాయాలతో చనిపోయి పడి ఉందని మృతురాలి తల్లి పోలీసులకు తెలిపింది. తన కూతురిపై అనుమానంతోనే అల్లుడు కొట్టి చంపేశాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పోలీసుల అదుపులో నిందితుడు?

భార్య మృతి చెందిన విషయం తెలుసుకున్న శివరంగయ్య ఆదివారం తెల్లవారుజామునే పోలీస్‌స్టేషన్ కు వెళ్లి జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పి లొంగిపోయినట్లు సమాచారం. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు.

డ్రైవర్ నిద్రమత్తు కారణంగా..



ముందుభాగం దెబ్బతిన్న ట్రావెల్స్ బస్సు

- గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టిన కావేరి ట్రావెల్స్ బస్సు
- ఏడుగురికి గాయాలు

సింగరాయకొండ: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చి కావేరి ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతినడంతో పాటు బస్సులోని ఏడుగురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై సింగరాయకొండ మండల పరిధిలో జీవీఆర్ ఆక్వా కంపెనీ సమీపంలోని ఫ్లై ఓవర్‌పై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు బస్సు వెళ్తుండగా, తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా గోసాలపేటకు చెందిన చెనగల మహేష్, బాలాపూర్‌కు చెందిన ఈదుల మురళీధర్, మరాఠీ హల్వాల్‌కు చెందిన పతంగి సూర్యప్రకాష్, పతంగి రామ్‌కుమార్, గనీత్‌నావునక్, మియాపూర్‌కు చెందిన మరకవీరేందర్‌తో పాటు తిరుపతి జిల్లా కాళహస్తికి చెందిన సురాతి విజయ్‌సాయికుమార్‌కు గాయాలయ్యాయి. వీరిని 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. మిగతా వారికి గాయాలు లేవని, సురక్షితంగా ఉన్నారని ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే టంగుటూరు హైవే మొబైల్ పోలీసులు, స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బాధితులను త్వరితగతిన ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.



గాయపడిన ప్రయాణికుడు

పథకం ప్రకారమే హత్య

- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- ఇద్దరు నిందితుల అరెస్టు, టిప్పర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు

మార్కాపురం: మార్కాపురం మండలం కుంట – జమ్మనపల్లి గ్రామాల మధ్య ఈ నెల 9వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో కుట్రకోణాన్ని వెలికితీశారు పోలీసులు. హత్యచేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సీఐ సుబ్బారావుతో కలిసి ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసును సవాలుగా తీసుకుని తమ ఎస్సై అంకమరావు, సిబ్బంది దర్యాప్తు చేపట్టి 3 రోజుల్లోనే సంఘటనకు కారణమైన ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. మరొకరిని త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం..

కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈర్నపాటి సుబ్బలక్ష్మమ్మకు 30 ఏళ్ల క్రితం ఈర్నపాటి వెంకటేశ్వర్లుతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. 2005లో తిప్పనబోయిన వెంకట నారాయణతో తన భార్య సుబ్బలక్ష్మమ్మకు అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో వెంకట నారాయణను గొడ్డలితో నరికి చంపడంతో 9 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి 2019లో జైలునుంచి వెంకటేశ్వర్లు విడుదలయ్యాడు. అయితే, తన భార్య సుబ్బలక్ష్మమ్మ పద్ధతి మార్చుకోలేదని, కుటుంబ పరువు తీస్తోందని, ఆస్తి విషయంలో గొడవపడుతోందని, కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందన్న కారణంతో సుబ్బలక్ష్మమ్మను చంపాలని భర్త పెద్ద వెంకటేశ్వర్లు, ఆయన ఇద్దరు తమ్ముళ్లైన చిన్న వెంకటేశ్వర్లు, వెంకట రమణ కలిసి నిర్ణయించుకున్నారు. సుబ్బలక్ష్మమ్మ కొన్నేళ్లుగా మార్కాపురం పట్టణంలో నివాసముంటూ దుస్తుల వ్యాపారం చేస్తోంది. అందులో భాగంగా ఈ నెల 9న సుబ్బలక్ష్మమ్మ కొత్తపల్లి గ్రామానికి వెళ్లి దుస్తులమ్ముకుని తన మేనకోడలైన ఏడుమళ్ల రాధ అలియాస్ రాధాంజలి (17)ని తన టూవీలర్‌పై ఎక్కించుకుని మార్కాపురం బయలుదేరింది. కోమటికుంట జంక్షన్‌కు 2 కిలోమీటర్ల దూరంలో ఉండగా, ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సుబ్బలక్ష్మమ్మను తమ టిప్పర్‌తో ఢీకొట్టించి చంపాలనే ఆలోచనతో ఈర్నపాటి పెద్ద వెంకటేశ్వర్లు, చిన్న రమణయ్య ప్రోద్బలంతో చిన్న వెంకటేశ్వర్లు టిప్పర్ నడుపుకుంటూ వచ్చాడు. పథకం ప్రకారం స్కూటీని ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే రాధాంజలి మృతి చెందింది. సుబ్బలక్ష్మమ్మ కూడా లారీ కింద పడి గాయాలతో ఉండటంతో ఆమె చనిపోలేదని భావించి చిన్న వెంకటేశ్వర్లు టిప్పర్ దిగి కర్రతో ఆమెపై హత్యాప్రయత్నం చేయబోయాడు. కానీ, రోడ్డుపై వెళ్తున్న జనాలు గమనించడంతో అక్కడే కర్ర వదిలి పారిపోయాడు. ఈ సంఘటనపై ముందుగా యాక్సిడెంట్ కేసు నమోదు చేశారు. అనంతరం కేసును లోతుగా దర్యాప్తు చేసి కుట్రకోణం బయటకు రావడంతో హత్యకేసుగా మార్చారు. పూర్తిగా దర్యాప్తు చేసి ఆదివారం చిన్న వెంకటేశ్వర్లు, రమణయ్యలను అదుపులోకి తీసుకొని విచారించారు. వారు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. మరో నిందితుడైన పెద్ద వెంకటేశ్వర్లును త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టి 3 రోజుల వ్యవధిలో నిందితులను అరెస్టు చేసిన సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమరావును ఎస్పీ దామోదర్ అభినందించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు

ముగ్గులే మురిసేలా..!

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. జిల్లావ్యాప్తంగా పలు సంస్థల ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. వినూత్నంగా భారీ ముగ్గులు వేసి రంగులతో తీర్చిదిద్దితున్నారు. ఒకరిని మించి మరొకరు ఆకర్షణీయంగా ముగ్గులు వేస్తున్నారు. విజేతలకు మంచి బహుమతులు కూడా అందిస్తుండటంతో పోటాపోటీగా సత్తాచాటుతున్నారు.

– సాక్షి, ఒంగోలు



సంతనూతలపాడులో ముగ్గుల పోటీల్లో ముగ్గులో మగువను మలిచిన దృశ్యం



చీమకుర్తిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



సంతనూతలపాడులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న వాసవీ క్లబ్‌ల ప్రతినిధులు



గిద్దలూరులోని కుసుమహరనాథ దేవస్థానం ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు



ఉప్పుగుండూరులో వాసవీ క్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు